ఉదయం 6గంటలకే పింఛన్ల పంపిణీ : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్టీఆర్ భరోసా పింఛన్లను 1వ తేదీ ఉదయం 6గంటల నుంచే లబ్ధిదారులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పింఛన్ల పంపిణీపై కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో డీఆర్డీఏ, నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, బ్యాంకు నోడల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారుల ఇళ్లవద్దకే వెళ్లి పింఛన్లు ఇవ్వాలన్నారు. ఇందుకు అవసరమైన డబ్బును బ్యాంకుల నుంచి సకాలంలో తెచ్చుకుని సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. ఒకటో తేదీన హౌసింగ్ పరిధిలో హౌసింగ్ కాలనీలలో పూర్తయిన ఇళ్లకు సంబంధించిన తాళాలు అప్పగించే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, ఎల్‌డిఎం నర్సింగరావు, డీవీఈవో వెంకటరమణ నాయక్, హౌసింగ్ పీడీ శైలజ, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నామినేటెడ్ ఆశలు...!

జూన్‌లోపు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం నాడు ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులతో టెలికాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. ఈ సమయంలో ఆయన నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశంపైనా మాట్లాడారు. జూన్ నెలలోపు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు చెప్పారు. అయితే పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించాలని ప్రజాప్రతినిధులకు ఆయన సూచించారు.



జూన్‌లోపు భర్తీ చేస్తామంటూ ముఖ్యమంత్రి ప్రకటన

పదవులపై నాయకుల ఆశలు

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

ముఖ్యమంత్రి ప్రకటనతో ఆశావహుల్లో ఉత్సహం నెలకొంది. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ ఉమ్మడి జిల్లాలో ఎప్పుడూలేని విధంగా విజయం సాధించింది. దీనికితోడు ఈసారి కూటమి పార్టీలు ఉన్నాయి. టిడిపితోపాటు, బిజెపి, జనసేన పార్టీలూ ఉన్నాయి. పదవుల్లో వీరికి పంపకాలు చేయాల్సి ఉంది. ఇప్పటికే అహుడా ఛైర్మన్ పదవిని జనసేనకు కేటాయించారు. ఆ పార్టీల నుంచి కూడా ఆశావహులు ఉండటంతో టిడిపి నేతల్లో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో సందిగ్ధత నెలకొంది. తమకు పదవులు వస్తాయా లేదా అన్న గుబులు నెలకొంది. మొదటి మూడు పంపకాల్లో జిల్లాలో ముఖ్య నేతలకు ఆశించిన పెద్ద పదవులేవి రాలేదు. ఇప్పుడు మార్కెట్‌యార్డు, దేవాలయాల ఆలయ కమిటీల్లో నైనా అవకాశాలు దక్కుతాయా లేదా అన్న సందేహాలు ఉన్నాయి. వీటినైనా త్వరగా తేలిస్తే బాగుంటుందన్న అభిప్రాయం ఆ పార్టీ నేతల నుంచి వ్యక్తమవుతోంది.

సహకార సంఘాలపైనా ఆశలు

నామినేటెడ్ పదవులే కాకుండా సహకార సంఘాలపైనా ఆశలు పెట్టుకున్న వారున్నారు. ఈ సంఘాలకు ఎన్నికలు జరగక చాలాకాలమైంది. గత ప్రభుత్వం పర్సన్ ఇన్‌ఛార్జీలను పెట్టి వారితోనే సహకార సంఘాలను కొనసాగించింది. టిడిపి ప్రభుత్వం మాత్రం సహకార సంఘాల ఎన్నికలకూ కసరత్తును చేపట్టింది. సభ్యత్వాలను చేపడుతున్నారు. ఎన్నికలు నిర్వహించే అవకాశాలే అధికంగానున్నట్టు తెలుస్తోంది. ఎన్నికలు జరిగితే పార్టీ తరుపున పోటీ చేసేందుకు కొంత మంది సిద్ధమవుతున్నారు. ఎందుకంటే ప్రతిపక్ష వైసిపి ఎన్నికల బరిపై పెద్దగా ఆసక్తి చూపే పరిస్థితులు కనిపించడం లేదు. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లోనూ ఇది స్పష్టంగా కనిపించింది. చాలా వరకు ఏకగ్రీవం చేసుకున్నారు. అదే ఫార్ములా సహకార సంఘాల ఎన్నికలు జరిగినా అమలు జరుగుతుందని అధికార టిడిపి నేతలు భావిస్తున్నారు. ఏది ఏమైనా అన్ని పదవులను త్వరితగతిన భర్తీ చేయాలని టిడిపి నేతలు కోరుతున్నారు.

కందుల కొనుగోలు ప్రకటనలకే పరిమితమా..?

◆ముఖ్యమంత్రికి లేఖ పంపుతాం ◆సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-ఉరవకొండ

జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ప్రకటనలకే పరిమితం అయ్యిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ విమర్శించారు. ఉరవకొండలో రైతులు నిల్వ చేసుకున్న కందులను సిపిఎం బృందం మంగళవారం పరిశీలించింది. అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఈనెల 23న కందుల కొనుగోలు కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఉరవకొండ మార్కెట్ యార్డులో ప్రారంభించారన్నారు. ప్రారంభం చేసినా ఇప్పటివరకు ఒక్క గింజ కూడా రైతుల నుంచి కొనుగోలు చేయలేదన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి కృషి చేశానని, కలెక్టర్ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పడం హాస్యాస్పదం అన్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో అధికారులు, పాలకుల మాటలు నీటిమూటలుగానే ఉన్నాయన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు అండగా నిలవాల్సి ఉందన్నారు. జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాలను తక్షణం అందుబాటులోకి తేవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు లేఖ పంపుతామన్నారు. కందుల కొనుగోలులో ప్రభుత్వం విధించిన నిబంధనలు సడలించాలన్నారు. తేమ శాతం 15 ఉన్న కందులనూ కొనుగోలు చేయాలన్నారు. రైతులు పండించిన పంట మొత్తాన్ని కొనుగోలు కేంద్రాల్లో తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కంది పంటను పూర్తి స్థాయిలో కొనేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూదన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాల రంగయ్య, రంగారెడ్డి, రైతు సంఘం నాయకులు రామాంజనేయులు నాయక్, శీనప్ప, వీరాంజనేయులు, సిద్ధప్ప, మురళి, వెంకటేశు లు, రైతులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డులో నిల్వ ఉంచిన కందులను పరిశీలిస్తున్న సిపిఎం బృందం

సిపిఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నెల్లూరు జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 3వ తేదీ నుంచి జరగనున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో మహాసభల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మహాసభ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో రైతులు, పేదలు, కష్టజీవులు, కార్మికుల సమస్యలపై సిపిఎం అనేక పోరాటాలు చేసిందన్నారు. గత పోరాటాలు, భవిష్యత్ కార్యక్రమాలపై మహాసభల్లో చర్చలు జరుగుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఉద్యమాల్లో పని చేసిన 600 మందికి పైగా ప్రతినిధులు మహాసభలకు హాజరవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. విజన్ 2047 పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేయడానికి, ప్రజల మీద భారాలు వేయడానికి సిద్ధం అవుతోందన్నారు. ప్రజలపై భారాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలకు బలపరచాలని కోరారు. 3వ తేదీన నెల్లూరులో నిర్వహించే మహాసభల బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బందాకరత్, ఎం.ఎ.బేబీ, బివి.రాఘవులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవిలు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలోని సిపిఎం నాయకులు, కార్యకర్తలు మహాసభలకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, వి.రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.నాగమణి, టి.రామాంజనేయులు, వై.వెంకట నారాయణ, ఎస్.ముత్తూజ, నగర నాయకులు ప్రకాష్ రెడ్డి, మసూద్ పాల్గొన్నారు.

'వ్యవసాయం శ్రమజీవనం'

రైతు కూలీలు సంఘటితం కావాలి - విశ్రాంత సిఎస్ ఐవైఆర్.కృష్ణారావు

సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత సిఎస్ ఐవైఆర్.కృష్ణారావు

ప్రజాశక్తి-అనంతపురం

వ్యవసాయం రైతు కూలీలతో కలిసిన శ్రమజీవనం అని విశ్రాంత సిఎస్ ఐవైఆర్.కృష్ణారావు తెలిపారు. ఎస్‌కె యూనివర్సిటీ కాన్ఫరెన్స్ హాలులో రైతు కూలీల సదస్సు కార్యక్రమాన్ని గ్రామీణాభివద్ధి శాఖ, సామాజిక సమ్మిళిత అధ్యయన కేంద్రం విభాగం అధిపతి ముని నారాయణప్ప అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్తగాగా పాల్గొన్న కృష్ణారావు మాట్లాడుతూ వివిధ కులవత్తుల్లో నైపుణ్యం ఉన్నవారు ఆర్థికంగా నిలదొక్కు కోగలిగారని చెప్పారు. మిగిలిన వారు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. స్వాతంత్ర్యానంతరం ఏ ప్రభుత్వం కూడా రైతులపై శ్రద్ధ చూపలేదన్నారు. రైతు కూలీలను సంఘటితం చేస్తే వారు ఆర్థికంగా, సామాజికంగా ప్రయోజనం పొందడానికి వీలుకలుగుతుందన్నారు. 2000 సంవత్సరంలో పెట్టుబడి భాగస్వామ్యం కలిగిన కొన్ని పరిశ్రమలు వచ్చినా, వాటికి మార్కెటింగ్ సౌకర్యం సరిగా లేకపోవడం విఘాతంగా నిలిచిందన్నారు. రెక్టార్ జి.వెంకటనాయుడు మాట్లాడుతూ రైతులు, కూలీలకు మధ్య సత్సంబంధాలు అవసరం అన్నారు. వ్యవసాయ రంగంలో యాంత్రికరణ, విత్తనాల ధరలు పెరగడం, గిట్టుబాటు ధరలు లేకపోవడం వ్యవసాయ రంగాన్ని కుదేలు చేసిందన్నారు. రైతులు కూలీలు కష్టపడితే ఆహార ధాన్యాలు ఉత్పత్తి జరుగుతుందని, లేకుంటే భవిష్యత్తులో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. న్యాయవాది రాఘవేంద్ర మాట్లాడుతూ అనంతపురం జిల్లా హార్టికల్చర్ హబ్‌గా రూపాంతరం చెందిందన్నారు. హంద్రీనీవా కారణంగా భూగర్భ జలాలు వృద్ధి చెందాయన్నారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన ప్రతినిధులు రైతులతో మాట్లాడి వారి కష్టాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుబ్బరామరాజు, రేనాటి నాగేశ్వర్ రెడ్డి, చెన్నకేశవ, సత్యసాయి జిల్లా సామాజిక సమరసతా వేదిక సంయోజక వాసుదేవయ్య, ప్రొఫెసర్ మురళీధర్ రావు, విశ్రాంత ఆచార్య చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ప్రతిభా అవార్డును అందుకుంటున్న ఉపాధ్యాయుడు, విద్యార్థులు

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ

ఉపాధ్యాయ విభాగంలో ప్రథమ బహుమతి - విద్యార్థులకు ప్రత్యేక అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పుదుచ్చేరి ప్రభుత్వం డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు పుదుచ్చేరి ఓల్డ్ పోర్ట్ గ్రౌండ్‌లో నిర్వహించిన దక్షిణ భాతదేశం స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్తా చాటారు. ఉపాధ్యాయ విభాగంలో జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించిన ఉపాధ్యాయ విభాగం రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతిని గెలుచుకుంది. ఉరవకొండ మండలం ఆమిద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు బండి శ్రీనివాసులు తయారు చేసిన "కాంతి ధర్మాలను సులువుగా వివరించేందుకు ఉపాధ్యాయులకు ఉపకరించే పరికరాలు" అనే ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి దక్కింది. పుదుచ్చేరి స్పీకర్, విద్యా శాఖామంత్రి చేతుల మీదుగా ఉపాధ్యాయుడు బండి శ్రీనివాసులు బహుమతిని అందుకున్నారు. విద్యార్థి విభాగంకు సంబంధించి కనేకల్ మండలం హనకనహాల్ జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలకు విద్యార్థినులు పి.గీతా రెడ్డి (9వ తరగతి), డి.మహాలక్ష్మి (9వ తరగతి)లు తయారుచేసిన "వద్ధులకు అన్ని విధాలుగా ఉపయోగ పడే ఊత కర్ర" ప్రాజెక్టుకు ప్రత్యేక కేటగిరీ బహుమతి లభించింది. గైడ్ ఉపాధ్యాయులు మేడా ప్రసాద్ ఎస్‌ఎ, బయో. ఆధ్వర్యంలో విద్యార్థినులు ఈ ప్రాజెక్టును తయారు చేశారు. సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ చాటిన ఉపాధ్యాయుడు, విద్యార్థులు, వీరిని ప్రోత్సహించిన జిల్లా విద్యా శాఖాధికారి బి.ప్రసాద్ బాబు, సైన్స్ అధికారి బాలమురళీ కృష్ణలను కలెక్టర్ వినోద్ కుమార్ అభినందించారు.

మార్గదర్శకుడు మల్లారెడ్డి

50 ఏళ్ల స్వచ్ఛంద సేవపై ప్రశంసలు

ఫాదర్ ఫెర్రర్ స్ఫూర్తితోనే : మల్లారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పరుల కోసం పాటుపడని నరుడి బతుకెందనే నానుడికి వైవి.మల్లారెడ్డి అతికినట్టు సరిపోతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్వచ్ఛంద సేవలో వైవి.మల్లారెడ్డి 50 ఏళ్ళ సేవలను పూర్తిచేసుకున్న సందర్భంగా ఆర్డీటీ, ఎఎఫ్ ఎకాలజీ సంయుక్త ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతపురం రూరల్ పరిధిలోని పంగల్ రోడ్డు సమీపంలో ఉన్న ఎన్‌క్లుజీవ్ పాఠశాలలో మంగళవారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు మేధావులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆర్డీటీ సంస్థ ప్రతినిధి అన్నె ఫెర్రర్ మాల్లారెడ్డి చేపట్టిన కృషిని ఈ సందర్భంగా అభినందించారు. ఆర్డీటీతో కలసి ఆయన సుదీర్ఘకాలం అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈనాడు ఎడిటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పరుల కోసం పాటుపడని బతుకెందుకన్న నానుడికి మల్లారెడ్డి అతికినట్టు సరిపోతారని ఆయన చెప్పారు. ఆయనతో తనకున్న అనుబంధం 35 సంవత్సరాలదని చెప్పారు. తమ సంస్థ తరుపున చేపట్టే సేవా కార్యక్రమాల సందర్భంగానే ఆయనతో కలసి కొంతకాలం పనిచేసామని చెప్పారు. ఎపి మాస్ ప్రతినిధి సిఎస్.రెడ్డి మాట్లాడుతూ ఇంత సుదీర్ఘకాలం సేవలందించడాన్ని కొనియాడారు.

ఫాదర్ ఫెర్రర్ స్ఫూర్తితోనే : వైవి.మల్లారెడ్డి

ఫాదర్ ఫెర్రర్ స్ఫూర్తితోనే ఇంత సుదీర్ఘకాలం సేవలందించగలిగానని డాక్టర్ మల్లారెడ్డి పేర్కొన్నారు. ఆయనతో పనిచేసే కాలంలో ఆయన నుంచి నేర్చుకున్నది చాలా ఉందని చెప్పారు. అందరితో ఏ రకంగా మర్యాదగా మసలుకోవాలన్నది నేర్చుకున్నానన్నారు. అనేక బెదిరింపులు ఎదురైనా ధైర్యంగా నిలబడ్డానని చెప్పారు. అది ప్రజల అభిమానం, ప్రేమతోనే సాధ్యమైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టరు మాంఛూ ఫెర్రర్, విశాల ఫెర్రర్ తదితరులు పాల్గొన్నారు.

'హెచ్‌ఎన్ఎస్ఎస్' వెడల్పు పనులు వేగంగా చేపట్టాలి

ఆర్థిక శాఖ మంత్రి కేశవ్

మాట్లాడుతున్న ఆర్థిక శాఖ పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్‌ఎన్ఎస్ఎస్) కాలువ వెడల్పు పనులు వేగంగా చేపట్టాలని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి అనంతపురంలోని ఆర్అండ్‌బి అతిథి గృహంలో హెచ్‌ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు కింద 36ఎ ప్యాకేజీ, హెచ్‌ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హెచ్‌ఎన్ఎస్ఎస్ కింద మాల్యాల నుంచి జీడిపల్లి వరకూ కాలువ వెడల్పు జరుగుతోందన్నారు. అందులో జంగిల్ క్లియరెన్స్ మొదలు కాగా, పనులు వేగంగా చేపట్టాలన్నారు. జంగిల్ క్లియరెన్స్ కు ముందు, పనులు చేసిన తర్వాత డ్రోన్ ద్వారా క్యాప్చర్ చేసి ఫొటోలు తీయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా అవసరమైన భూసేకరణకు సంబంధించి పరిహారం చెల్లించేందుకోసం సిఎఫ్ఎంఎస్‌లో ఎక్కించాలని అధికారులను ఆదేశించారు. హెచ్‌ఎన్ఎస్ఎస్ కాలవ వెడల్పులో భాగంగా అడ్డుగా ఉన్న విద్యుత్ పోల్స్‌ని తొలగించాలన్నారు. భూ సేకరణ ఎక్కడ వరకు ఉందో అక్కడ వరకూ పెడ్ మార్కింగ్ చేయాలని, ఎక్కడ సమస్యలు ఉన్నాయా అక్కడ పెడ్ మార్కింగ్ చేసి పనులు మొదలు పెట్టాలని తహసీల్దార్,సర్వే శాఖ అధికారులను ఆదేశించారు. హెచ్‌ఎన్ఎస్ఎస్ కింద 33, 34 ప్యాకేజీల్లో కూడా జంగిల్ క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి నియోజకవర్గంలో, ఇతర చోట్ల అవసరమైన భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో కర్నూలు హెచ్‌ఎన్ఎస్ఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ వరప్రసాద్, హెచ్‌ఎన్ఎస్ఎస్ ల్యాండ్ అక్విజేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, గుంతకల్లు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్‌నాయక్, కర్నూలు హెచ్‌ఎన్ఎస్ఎస్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఎపిఎస్‌పిడిసిఎల్ కళ్యాణదుర్గం ఆపరేషన్ ఇఇ శేషాద్రి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, సంబంధిత తహశీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరులో వరుస చోరీలు

ప్రజల బెంబేలు

ప్రజాశక్తి-యల్లనూరు

యల్లనూరు మండల కేంద్రంలో ఒకేరోజు అర్ధరాత్రి నాలుగు కుటుంబాల్లో చోరీ జరగడంతో మండలవాసులు భయాందోళన చెందుతున్నారు. గత శుక్రవారం అర్ధరాత్రి మండల కేంద్రంలో జరిగిన చోరీలో నగదుతోపాటు బంగారు వస్తువులను దోచుకెళ్లారు. చోరీ చేస్తోంది నిజమైన దొంగలేనా.. అని కూడా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే ఎవరైనా దొంగలు చోరీ చేస్తే ఇంట్లోని నగదుతోపాటు బంగారం, వెండి, విలువైన వస్తువులను ఎత్తుకెళ్తారు. అయితే ఇటీవల మండల కేంద్రంలో జరిగిన చోరీలను చూస్తే బంగారు, నగదుతోపాటు రైతులు పండించిన బియ్యాన్ని కూడా చోరీ చేయడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ చోరీని గమనించిన మండల వాసులు ఎవరో కొత్తవారు చోరీ చేయడం లేదని, మండలానికి చెందిన వారే దొంగతనానికి పాల్పడి ఉంటారని అనుమానిస్తున్నారు. అయితే కట్టెలు కోసుకుని దబ్బర అల్లేవాళ్లు ఏమైనా చోరీకి పాల్పడుతున్నారా.. అనే అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు. చోరీ జరిగిన రోజు నుంచి పోలీసుల కంటే స్థానికులే నిద్రపోకుండా గస్తీ నిర్వహిస్తుండటం గమనార్హం.

బీరువాలో దుస్తులను చెల్లాచెదురుగా వేసిన దొంగలు (పాతచిత్రం)

ఎస్ఐ లేకపోవడం అవకాశం

మండలానికి పూర్తిస్థాయిలో ఎస్ఐ లేకపోవడం కూడా చోరీలకు కారణమని స్థానికులు చెబుతున్నారు. మండలంలో పర్మినెంట్ ఎస్ఐ లేక సుమారు రెండు నెలలు కావస్తోంది. పర్మినెంట్ ఎస్ఐ ఉంటే చోరీలు చేయాలన్నా దొంగలు భయపడే అవకాశం ఉంది. ఎస్ఐ లేకపోవడం వల్లే దొంగలు అవకాశంగా భావించి చోరీలకు పాల్పడుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ఏదిఏమైనా మండలంలో చోటు చేసుకున్న వరుస చోరీలతో మండలవాసులు భయాందోళన చెందుతున్నారని చెప్పవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకుని మండల పోలీస్‌స్టేషన్‌కు పర్మినెంట్ ఎస్ఐని నియమించడంతోపాటు దొంగలపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బిల్లులివ్వకుంటే అడుక్కుతినాలా..?

కార్పొరేషన్‌లో కాంట్రాక్టర్ల మౌన నిరసన

నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

కాంట్రాక్టు పనులకు బిల్లులు చెల్లించకపోతే అడుక్కుని కుటుంబాలను పోషించుకోవాలా..? అంటూ కాంట్రాక్టర్లు వాపోయారు. దీర్ఘకాలంగా కమిషనర్ లాగిన్‌లో పెండింగ్ ఉన్న బిల్లులను ఆమోదించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్ వద్ద కాంట్రాక్టర్లు మౌన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ ఇప్పటికే 10 నెలల కాలంగా చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. పలుమార్లు కమిషనర్‌ను కలిసి బిల్లులను ఆమోదించాలని విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లుల అప్లోడింగ్ జరగకుంటే అందక ఆర్థికంగా చితికిపోయే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఇందుకు స్పందించిన కమిషనర్ మల్లికార్జునరెడ్డి స్పందించి కాంట్రాక్టర్లతో చర్చించారు. కాంట్రాక్టర్ల సమస్యలను విన్న కమిషనర్ వీలైనంత త్వరగా తన లాగిన్‌లోని ఫైళ్లను క్లియర్ చేసి పంపుతానని హామీ ఇవ్వడంతో వెనుదిరిగారు. ఈ ధర్నాలో కాంట్రాక్టర్లు రత్నమయ్య, వేణుగోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, నులక వెంకటేష్, ఇస్మాయిల్, షఫీ, బొట్టు సుధాకర్, హబీబ్, గొట్కూరు నాగరాజు, సుధాకర్, శివశంకర్, మురళి, నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి-గుంతకల్లు



వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేతలు

విద్యుత్‌శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలని సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం స్థానిక కార్యాలయంలో విద్యుత్ శాఖ డిఎఇ నాగేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కూటమి నాయకులు విద్యుత్ శాఖలో దశాబ్ధకాలంగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న కార్మికులను పర్మనెంట్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న ఎరియర్స్ చెల్లించాలని, 2018లో తీసుకున్న షిఫ్ట్ ఆపరేషన్లుగా ఉద్యోగోన్నతులు పొందిన వారికి పాతవారితో సమానంగా వేతనం ఇవ్వాలని, వారి బకాయిలు చెల్లించి ప్రతి సబ్‌స్టేషన్‌లో నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని, ఫీల్డ్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ఐటిఐ విద్యార్హత ఉన్న అందరికీ స్కిల్ వేతనాలు ఇవ్వాలన్నారు. ఓపెన్ టెండర్ విధానాన్ని రద్దు చేసి కార్మికులకే ఉపాధి అవకాశాలు కల్పించాలనిడిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు జగదీష్, నాయకులు ఎస్‌కెఎం బాషా, వన్నూరప్ప, పీరా, రాజు, తేజ, హుస్సేన్, పీరా, అనిల్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఏపిజిబి ప్రధాన కార్యాలయం కడపలోనే ఉంచాలి

30న రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని రాయలసీమ అభివృద్ధి వేదిక అనంతపురం జిల్లా కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ డిమాండ్ చేశారు. మంగళవారం వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు మన రాయలసీమకు సంబంధించిన ముఖ్యమైన బ్యాంకు అన్నారు. రాయలసీమ గ్రామీణ ప్రాంతాలకు, రైతులకు ఏంతగానో బ్యాంకు సేవలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. బ్యాంకు ప్రధాన కార్యాలయం ప్రస్తుతం కడపలో చాలా సంవత్సరాలుగా ఉందన్నారు. బ్యాంకింగ్ రంగంలో లాభాలతో నడుస్తున్న బ్యాంకుగా రీజనల్ బ్యాంకు గుర్తింపును సాధించడంలో కడప ప్రధాన కార్యాలయం పాత్ర కీలకమైంది అన్నారు. మన రాయలసీమలో ఈ బ్యాంకు ప్రధాన కార్యాలయం ఉండటం మనకు ఎంతో గర్వకారణం అన్నారు. కానీ గ్రామీణ బ్యాంకుల విలీన ప్రక్రియను సాకుగా చూపి ఈ ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి తరలించి అమరావతిలో పెట్టాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ, మన అభిప్రాయాన్ని ప్రభుత్వానికి తెలియజేయడం కోసం ఈనెల 30న ఎన్జీఓ హోంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశానికి, అన్ని ట్రేడ్ యూనియన్, రైతు సంఘాలు, విద్యార్థి సంఘాలు, పౌర, ప్రజా, ఉద్యోగ, పెన్షనర్ల సంఘాల నేతలు, మేధావులు హాజరై తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

తాగునీటి ఎద్దడిని నివారించాలి

ఎంపిఎ లేఅవుట్ కాలనీవాసుల రాస్తారోకో

ఆందోళనకారులతో చర్చిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-రాయదుర్గం

దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న తాగునీటిఎద్దడితోపాటు వీధిదీపాల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాయదుర్గంలోని ఎంపిఎ లేఅవుట్ కాలనీవాసులు మంగళవారం కణేకల్ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న తాగునీటితోపాటు వీధిదీపాల సమస్య పరిష్కరించాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. చేసేదిలేక ఆందోళనకు దిగినట్లు వాపోయారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని 15రోజుల్లోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

అదనపు బస్సులను నడపాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-గుంతకల్లు

వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

తిరుపతి వెళ్లే ప్యాసింజర్ రైళ్లు రద్దయిన కారణంగా గుంతకల్లు నుంచి గుత్తి, అనంతపురం వయా తిరుపతి ప్రయాణికులు ఇబ్బందులు గురికాకుండా అదనపు బస్సులను నడపాలని డివైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు డివైఎఫ్ఐ సంఘం నాయకులు ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ సంఘం ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు మాట్లాడుతూ రైల్వే శాఖ తిరుపతి వెళ్లే రైలు రద్దు చేయడంతో గుంతకల్లు నుంచి గుత్తి, అనంతపురం వయా తిరుపతి ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రయివేట్, ఉద్యోగులు ఆసుపత్రులకు, కళాశాలలకు, ఇతర అవసరాలకు నిమిత్తం నిత్యం రద్దీగా ఉండే రూట్ కావడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు పడుతున్నారన్నారు. ప్రయాణికుల ప్రయోజనాలను అవసరాలను దృష్టిలో పెట్టుకుని అదనపు బస్సు సర్వీసులను నడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర కార్యదర్శి రమేష్, డివైఎఫ్ఐ నాయకులు షాషా, సూరి, రాము, బాలు, మంజు, శివయ్య, ఈరన్న, బబ్లూ, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL.DISTRICT JUDGE, ANANTHAPURAMU

E.P.No: 515/2023 in A.A.No:196/2020

Between:

M/s Shriram Finance Ltd. Guntakal Branch Rep.by its spl. power of Attorney/Authorized Signatory G.Raghavendra ...Decree Holder

And

1.Dudekula Ismail, S/o.Dudekula Lalu Swamy, D.No.S-6, Katavari Veedhi, Vajrakarurv.Mandal, Anantapur District.

2.Kumba gonda virupakshi, S/o.Kumba Gonda Linganna, D.No.6-91, Patta vari street, Vajrakarur Mandal, Anantapur District. ...Judgement Debtors

వేలం ప్రకటన

అర్జీదారుడు ఇ.పి.మొత్తమును రాబట్టుటకు జె.డి.ఆర్.కు సంబంధించిన ఈ క్రింది షెడ్యూలు దాఖలు ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చి యున్నారు. వేలములో పాల్గొనదలచిన వారు 31/01/2025 వ తేది ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలములో పాల్గొనవచ్చును.

SCHEDULE

The property situated within the limits of Vajrakarur or Vajrakarur Village, within the SRD of Uravakonda and RD of Ananthapuramu.The details are furnished hereunder.

S.NO.	Sy.No	EXTENT
1.	499	2.67 Acres
2.	830	

Bounded By : Survey Number 499&830, East: Vanka West: Sivareddy Land North: Balasa Ramanna Land South: Rmtha

D.Hr.వాల్యూ రూ.2,00,000/-

అఫీస్ వాల్యూ రూ.10,68,000/- (కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

A.PRABHAKAR REDDY, Advocate, Ananthapuramu. Cell:9441380404

IN THE COURT OF THE VIth ADDITIONAL DISTRICT JUDGE : GOOTY

E.P.43/2023 in O.S.07/2017

Between:

S.Rahamath Bee ...D.Hr/Petitioner

Vs

S.K.Ramesh Babu ...J.Dr/Respondent

To.

1.S.K.Ramesh Babu, S/o.Late K.Laleppa, D.No.1/18-61 J, Near Dhaththreya Swamy Temple, Near Bye Pass Road, Pamidi - 515775.

వేలం నోటీసు

పై దావాలో వాదికి చెందిన బాకీ మొత్తాన్ని రాబట్టుకొనుటకు, దిగువ తెలిపిన ప్రతివాదికి చెందిన ఆస్తిని షెడ్యూల్లో వారి ఎదుట 24-02-2025 తేదీలో ఉదయం 10.30 గం॥ వేలము వేయుటకు వాయిదా వేసినారు. కావున వేలములో పాల్గొను వారు పై తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరై వేలములో పాల్గొనవలసినదిగా తెలియపరుచుట [illegible] తెలుపటమైనది.

SCHEDULE

House Property bearing D.No. 1-18-61J, Situated near Dhattatreya Swamy Temple, near Bye pass road, Pamidi Town and Mandal R.D. of Anantapur, S.R.D. of Pamidi with the following full particulars and boundaries: -

Babu Sy.No. Extent

Govt.Dry 912 Ac.0-94 Cents paiki plot No.16

Boundaries:-

East: 20 feet Road in Northern side and 13 feet Road in Southern side

West: Plot No.15 North: 20 feet Road

South: Waste Channel situated in Sy.No.897

Measurements : East - West : 33 Feet or 10.065 meters (Northern side).

East - West : 26 Feet or 7.93 meters (Southern side)

North-South : 48 Feet or 14.64 meters (Eastern side). North-South: 41 Feet or 12.50 meters (Western side) or 1312.75 Sq.Feet or 145.86 Sq.yards

Ameena Value of the Property : Rs.35,00,000/-

కె.మనోహర్‌బాబు, పి.ఓబులేసు
D.Hr తరఫు వకీళ్ళు

సర్వే అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ

రీ సర్వేకు రైతులు సహకరించాలి

కళ్యాణదుర్గం రూరల్ : రెవెన్యూ అధికారులు గ్రామాల్లో చేపట్టిన రీ సర్వేకు రైతులు అన్నివిధాలా సహకరించాలని ఆర్డీఓ వసంతబాబు కోరారు. మంగళవారం కుందుర్పి మండల పరిధిలోని కర్తనపర్తి గ్రామంలో చేపట్టిన రీసర్వేను ఆర్డీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ప్రారంభించే ముందు సమీప పొలాల రైతులకు తప్పనిసరి నోటీసులుగానీ, సమాచారం అందించాలని సిబ్బందికి సూచించారు. రైతులు పరిస్థితుల దృష్ట్యా ముందుస్తుగా కూడా సమాచారం అందించిన తర్వాతే సర్వే ప్రారంభించాలన్నారు. వీఆర్ఓ, సచివాలయ, మండల సర్వేయర్లు, వీఆర్ఏ, సంబంధిత రైతుల సమక్షంలో నిష్పక్షపాతంగా సర్వే చేపట్టి హద్దులు ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు పింఛన్ల తనిఖీ

యల్లనూరు : మండల వ్యాప్తంగా రూ.15వేలు పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులను బుధవారం తనిఖీ చేయనున్నట్లు ఎంపిడిఒ వాసుదేవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలవ్యాప్తంగా 53 మంది రూ.15వేలు పొందుతున్న పింఛనుదారులు ఉన్నారన్నారు. వారందరి పరిశీలన నిమిత్తం అధికారులు బుధవారం రెండు బృందాలుగా ఏర్పడి పరిశీలించనున్నట్లు తెలిపారు.

స్థలదాతలు, అధికారులకు సన్మానం

నార్పల : ఇటీవల మండల కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి ఇస్తెమా నిర్వహణకు స్థలం ఇచ్చిన దాతలు, సహకరించిన అధికారులను మంగళవారం స్థానిక ఈద్గా మజీద్ మైదానంలో ముస్లిముల జిల్లా ప్రతినిధి అమీర్‌బాషా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా స్థలదాత ఆకుల విజయకుమార్ (బాబు), గుత్తి పక్కిరెడ్డి, ఆకుల కిషోర్, నిచేనమెట్ల సురేష్‌కుమార్, గుత్తి గోపాల్‌రెడ్డి, పాటిల్ రమణారెడ్డి, జాజప్ప గారి లక్ష్మిరెడ్డి, జాఫర్‌వలి, సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ సాగర్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, విద్యుత్ లైన్‌మెన్ బాలకృష్ణారెడ్డి, తదితరులకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, ముస్లిం యువకులు తదితరులు పాల్గొన్నారు..

అంగన్వాడీలకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

దేశవ్యాప్తంగా ఐసిడిఎస్ సంస్థలో పని చేస్తున్న అంగన్వాడీ వర్కర్లకు సుప్రీం కోర్టు, గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేసి తగిన న్యాయం చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. అఖిలభారత అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపులో భాగంగా మంగళవారం రాయదుర్గంలో రాష్ట్రపతికి అంగన్వాడీలు రాసుకున్న విన్నపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టుతో పాటు గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అనుసరిస్తూ దేశవ్యాప్తంగా ఉన్న అంగన్వాడీలను క్రమబద్ధీకరించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని, ఆరేళ్లలోపు పిల్లలందరికీ శిశు సంరక్షణ, విద్య, అభివృద్ధిని కట్టుదిట్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు రాధమ్మ, రాధిక, రుద్రమ్మ, రూప, అనురాధ, శోభ, ఉల్లిగమ్మ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రపతికి రాసిన లేఖలు విడుదల

రాయదుర్గంలో లేఖలను విడుదల చేస్తున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

పుట్లూరు : అంగన్వాడీ వర్కర్లకు సుప్రీంకోర్టు, గుజరాత్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేసి తగిన న్యాయం చేయాలని సిఐటియు మండల నాయకులు సూరి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండలంలోని కడవకల్లులో నిర్వహించిన సెక్టార్ మీటింగ్‌లో అంగన్వాడీలు రాష్ట్రపతికి రాసుకున్న విన్నపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా అంగన్వాడీలు తక్కువ వేతనంతో విధులు నిర్వహిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కావున వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సుప్రీంకోర్టు, గుజరాత్ హైకోర్టు ఆదేశాల మేకు అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో సిఐటియు నాయకులు ఉమాగౌడ్, అంగన్వాడీ సెక్టార్ లీడర్లు జయమ్మ, శశికళ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

నగరంలోని ఆదర్శనగర్‌లో ఉన్న సచివాయం, అంగన్వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సిబ్బంది ఎంత మంది ఉన్నారు, ఎంత మంది ఇంకా విధులకు రాలేదన్న అంశాలపై గురించి తెలుసుకున్నారు. అంతేగాకుండా కార్యాలయంలో సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలవుతున్నా ఇంకా ఎందుకు ఫొటోలు పెట్టలేదన్నారు. తర్వాత సచివాలయ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. వెంటనే శుభ్రం చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజల సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని వారికి అనునిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి అక్కడ పిల్లల హాజరు శాతాన్ని పరిశీలించారు. కొంత మంది పిల్లలు హాజరు కాక పోవవడంపై ఆయన ఆరాతీశారు. పిల్లలు ఎందుకు హాజరు కావడం లేదన్నారు. పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు అందించే పౌష్టికాహారం, ఇతర వాటిని క్రమం తప్పకుండా అందించాలని ఇందులో ఎవరైనా చేతివాటం, అక్రమాలకు పాల్పడితే చర్యలు తీవ్రంగా ఉంటాయని ఎమ్మెల్యే దగ్గుపాటి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొనంకి గంగారామ్, మాజీ కార్పొరేటర్ సరిపూటి రమణ, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ పిఎల్ఎన్.మూర్తి, టిడిపి నాయకుడు పతకమూరి రామ్‌ప్రసాద్, వన్నూరప్ప, మహబూబ్‌బాషా, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో రేషన్ పంపిణీ చేయాలి

జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సమావేశంలో మాట్లాడుతున్న జెసి శివ్‌నారాయణ్‌శర్మ

పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న నిత్యావసర వస్తువులు నిర్ణీత సమయంలో సజావుగా పంపిణీ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ నారాయన శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి పౌర సరఫరా శాఖ సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ అందరూ సిఎస్‌డిటీలు అన్ని ఎండియు వాహనాలు నిర్ణీత సమయంలో నిత్యావసర వస్తువులు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిధిలోని ఎఫ్పీ షాపులను, పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీలను క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలన్నారు. పిడీఎస్ బియ్యం ప్రక్క దారి పట్టకుండా నిఘా ఉంచి, అక్రమంగా తరలిస్తున్న వారి మీద 6ఎ కేసులు నమోదు చేయాలన్నారు. దీపం-2 పథకం క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేయాలన్నారు. గ్యాస్ సిలిండర్ సరఫరా చేసే సమయంలో అదనపు చార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లంఘించే గ్యాస్ ఏజెన్సీల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. నిత్యావసర వస్తువులు పంపిణీ తూకంలో తేడా రాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రమేష్ రెడ్డి, సిఎస్‌డిటిలు, ఎండియు వాహన అధ్యక్షుడు, ఎఫ్పీ షాపు డీలర్ సంఘం అధ్యక్షుడు పాల్గొన్నారు.

మద్దతు ధరతో కందుల కొనుగోలు

జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-గార్లదిన్నె

గార్లదిన్నెలో రైతులతో మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

రైతులు పండించిన కందిపంటను మద్దతు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి శాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన పంటను దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వానికి అమ్మాలన్నారు. ప్రభుత్వం మద్దతు ధర కింటాకు రూ.7,550 కేటాయించినట్లు తెలిపారు. పంట నమోదు చేసుకున్న రైతుల నుంచి ఎకరాకు 2.5 క్వింటాళ్ల ప్రకారం కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రబీలో సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ రవి, మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్, ఎఇఒ స్రవంతి, రైతులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : రైతులు పండించిన కందులను ప్రభుత్వమే కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సాయికుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్వింటా రూ.7,550 మద్దతు ధరతో కొనుగోలు చేసేందుకు నిర్ణయంచినట్లు తెలిపారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా కంది పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా పురపాలక మండలి సమావేశం

సగంమంది గైర్హాజరు

ప్రజాశక్తి-రాయదుర్గం

కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

రాయదుర్గం పురపాలక సంఘపు పాలకమండలి సాధారణ అత్యవసర సమావేశాన్ని అధ్యక్షులు పోరాళు శిల్ప అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. అయితే మండలిలో 32 మంది సభ్యులు ఉండగా కేవలం 16 మంది మాత్రమే హాజరుకావడంతో సమావేశం గంటన్నర ఆలస్యంగా మొదలైంది. ఈనేపథ్యంలో సాధారణ, అత్యవసర సమావేశంలోని అంశాలను సిబ్బంది చదివడంతోపాటు కేవలం ఇద్దరూ, ముగ్గురు సభ్యులు మాత్రమే కొన్నిఅంశాలపై చర్చించడం గమనార్హం. పాలకమండలి సాధారణ నిధులు అంతమాత్రంగా ఉండటంతో అత్యవసరం కానీ కూరగాయలు మార్కెట్ మొదటి అంతస్తు పైకప్పు మరమ్మతులు, పార్కుల అభివృద్ధికి సంబంధించిన అంశాలను వాయిదా వేయాలని సభ్యులు కోరారు. తాగునీటి సరఫరాకు సంబంధించి పాలకమండలి అనేక అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించినప్పటికీ, అవసరమైన నిధులు మంజూరు చేసినప్పటికీ పట్టణంలో అనేకచోట్ల తాగునీటి ఎద్దడి తప్పడం లేదన్నారు. అజెండాలో పొందుపరిచిన పలు టెండర్లకు సంబంధించిన అంశాల్లో కేవలం ఒకే సంస్థ అంచనా రేట్లకు 0.01 శాతం తక్కువ తేడాతో టెండర్ వేయడంతో ఆమోదించాల్సిన పరిస్థితి నెలకొంది. అమృత్ 2.0 పథకం కింద పట్టణంలో తాగునీటి సరఫరాకు అవసరమైన పనులు ప్రతిపాదనలో చేర్చాలని సభ్యులు కోరారు. జీరో అవర్‌లో సభ్యులు మాట్లాడుతూ పురపాలక సంఘం వద్ద ఫాగింగ్ మిషన్లు ఉన్నప్పటికీ పట్టణంలో సక్రమంగా ఫాగింగ్ చేయడం లేదని సభ్యులు ఆరోపించారు. పట్టణంలో దోమల బెడద అధికంగా ఉందని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సమావేశంలో పురపాలక సంఘ అధ్యక్షులు శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు, ఇతర అధికారులు, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి : సిఐ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సిఐ యువరాజు సూచించారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రోడ్డు భద్రత బాల్య వివాహాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువకులు వాహనాలు నడపడం తెలియకపోవడంతో ప్రమాదాల బారిన పడి కుటుంబాలను క్షోభలోకి నెడుతున్నారన్నారు. 18ఏళ్లు నిండిన యూత్ యువకులు తప్పనిసరి డ్రైవింగ్ లైసెన్సు పొందడంతో పాటు వాహనాలకు బీమా చేయించాలన్నారు. అలాగే రోడ్డు నిబంధనలు పాటించడంతోపాటు హెల్మెట్లను ధరించాలన్నారు. అదేవిధంగా బాల్య వివాహాలు చట్టరీత్యా నేరంతోపాటు కుటుంబ భవిష్యత్తు కూడా చిన్నాభిన్నం అవుతందన్నారు. ఇకపోతే ఇటీవల సైబర్ నేరగాళ్లు పెరిగిపోయారని ఆధార్ ఓటిపి అకౌంట్ నంబర్లు తెలియని వ్యక్తులు అడిగితే చెప్పకూడదన్నారు. ఆధార్ అప్డేట్ అకౌంట్ అప్డేట్ ఏటీఎం కార్డులు క్రెడిట్ కార్డులు ఓటిపి ల సంబంధించి సైబర్ నేర్గాల్లో ఫోన్ చేస్తే స్పందించకూడదన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

సీసీరోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్.కొండాపురం గ్రామంలో రూ.10లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ఎమ్మెల్యే ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 8 నెలల కాలంలోనే రూ.వేలకోట్లతో రాష్ట్రంలో సీసీ రోడ్లు, మురికి కాలువలు నిర్మించినట్లు తెలిపారు. ఇకపోతే తమ సొంత గ్రామ పంచాయతీలో కొత్త సిసి రోడ్లను ఏర్పాటు చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, మండల ఇన్‌ఛార్జి పసుపుల శ్రీరామ్‌రెడ్డి, పసుపుల నారాయణరెడ్డి, తహశీల్దార్ పుణ్యవతి, ఎంపిడిఒ సొలమాన్‌రాజ్, పొడరాళ్ల రవీంద్ర, ఓబుళపతి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సన్మానం

కలెక్టర్‌ను సన్మానిస్తున్న జెఎసి నేతలు

అనంతపురం కలెక్టరేట్ : 2024లో జరిగిన సాధారణ ఎన్నికలను జిల్లాలో సజావుగా విజయవంతంగా నిర్వహించినందుకు ఉత్తమ ఎన్నికల అధికారిగా అవార్డు స్వీకరించిన కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌ను ఎపి జెఎసి అమరావతి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ రెవెన్యూభవన్‌లో కలెక్టర్ వినోద్ కుమార్‌కు పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పోలీస్ డిపార్ట్‌మెంట్ రూపొందించిన నూతన సంవత్సరం డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ ఆర్ఎన్.దివాకర్‌రావు, మహిళా విభాగం ఎపి జెఎసి అమరావతి ఛైర్‌పర్సన్ బి.సురేఖరావు, అసోసియేట్ ఛైర్మన్ బి.మల్ల రాయుడు, ట్రెజరర్ సంతోష్‌గౌడ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ టి.పెద్దయ్య, ఆర్గనైజషన్ సెక్రటరీ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ తోట చెన్నప్ప పాల్గొన్నారు.

బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్‌గౌడ్

పామిడి : ఎపి బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్‌గౌడ్ నియమితులయ్యారు. ఈమేరకు మంగళవారం విజయవాడలో జరిగిన బిసి కులసంఘాల సమావేశంలో ఇందుకు సంబంధించిన నియామకపత్రాన్ని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌గౌడ్ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పజెప్పినందుకు ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. బిసిల సమగ్రాభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని తెలిపారు.

సినిమా థియేటర్ యాజమాన్యంపై ఫిర్యాదు

తాడిపత్రి : పట్టణంలోని ఎస్‌వి థియేటర్ (దాదా థియేటర్)లో అధిక టికెట్ ధరలు వసూలు చేస్తూ కనీస సౌకర్యాలు కల్పించని పట్టణానికి చెందిన కన్నా మంగళవారం స్థానిక కార్యాలయంలో తహశీల్దార్ రజాక్‌వలికి ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా యువకుడు మాట్లాడుతూ థియేటర్‌లో సినిమా ప్రేక్షకుల నుంచి ముక్కుపిండి అధిక టికెట్ ధరలు వసూలు చేస్తున్నారన్నారు. దీనికితోడు థియేటర్‌లో కాలం చెల్లిన శీతలపానీయాలను విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అలాగే మరుగుదొడ్ల నిర్వహణ చాలా అధ్వాన్నంగా ఉందన్నారు. వెంటనే సంబంధిత థియేటర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అశ్వర్థ నారాయణస్వామి ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎఎస్పీ రోహిత్

మండలం పరిధిలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వర్థ నారాయణస్వామి, భవాని భీమలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లను ఎఎస్పీ రోహిత్ మంగళవారం పరిశీలించారు. వచ్చేనెల 2వతేదీ నుంచి ప్రారంభం కానున్న అశ్వర్థ నారాయణస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అశ్వర్థంలో ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు అందజేశారు. ముఖ్యంగా భక్తుల క్యూలైన్లు, వాహనాల పార్కింగ్ వంటి విషయాలు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ రామసుబ్బయ్య, ఎస్ఐ నాగేంద్రప్రసాద్, ఇఒ సుబ్రమణ్యం, పోలీసు సిబ్బంది, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

'ఎస్‌వి'లో ముగిసిన శిక్షణ

శిక్షణకు హాజరైన విద్యార్థులతో అతిథులు

అనంతపురం : స్థానిక ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాలలో ఎపిఎస్ఎస్ డిసి, మహేంద్ర ప్రైడ్‌క్లాస్ రూమ్ నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో తృతీయ సంవత్సరం బీఎస్సీ విద్యార్థులకు నిర్వహించిన ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ సి.చక్రధరరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగం పొందటంలో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్ అనేవి కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్య శిక్షణా అధికారి పివివి ప్రతాప్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఎవి.ప్రసాద్, ఎఒ శ్రీనాథ్, ప్లేస్‌మెంట్ అధికారి ఎస్.సాయిరామ్, ఎపిఎస్ఎస్‌డిసి నాన్ టెక్నికల్ ఆఫీసర్ కె.నీరజ, మహేంద్ర ప్రైడ్ క్లాస్‌రూమ్ నాంది ఫౌండేషన్ శిక్షణ అధికారులు ఎస్.మహబూబ్ సుబహాని, ఎస్.పాశ, ఎస్.కృష్ణచైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

సాయిరాం (పాతచిత్రం)

డి.హీరేహాల్ : మండలంలోని హడగలి గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సాయిరాం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బళ్లారికి చెందిన సాయిరాం తన అవ్వతాతలను చూడడానికి రాయదుర్గం గ్రామ దట్ల గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా అడగలి గ్రామ సమీపంలో కుక్క అడ్డం రావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో బళ్లారి విమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. మృతుడి తండ్రి ఆంజనేయ మిర్యాల మెరుగు కేసు నమోదు చేసి విచారిస్తున్న పోలీసులు తెలిపారు.

గుత్తి ఆర్ఎస్‌లో చోరీ

గుత్తి : గుత్తి ఆర్ఎస్‌లో నివాసం ఉండే భవన నిర్మాణ కార్మికుడు గోపీ ఇంట్లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గోపీ తన భార్య రేవతితో కలిసి ఇంటికి తాళం వేసుకుని బంధువుల ఇంటికి వెళ్లారు. గమనించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలను తొలగించి లోనికి ప్రవేశించారు. గదిలో ఉన్న బీరువాను బద్దలు కొట్టి అందులో ఉన్న తులం బంగారు, 30 తులాల వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూసిన దంపతులకు వస్తువులు, దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉండడంతో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఉలవ పంట వామికి నిప్పు



కాలి బూడిదైన ఉలవ పంట

రాయదుర్గం : పట్టణ పొలిమేరలోని టిడిపి రోడ్డు మోడల్ కాలనీ సమీపంలో ఉలవ పంట వామికి నిప్పట్టుకోవడంతో సుమారు రూ.2లక్షల విలువైన పంట పూర్తిగా దగ్ధమైంది. వివరాల్లోకి వెళ్తే.. కౌలు రైతు పురుషోత్తం సుమారు పదెకరాల భూమిని లీజుకు తీసుకుని ఉలవ పంట సాగు చేశాడు. ఈనేపథ్యంలో చేనులో పంటను తీసి వామిగా ఏర్పాటు చేసుకున్నారు. మంగళవారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తులు వామికి నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయింది. తర్వాత అగ్నిమాపక దళం వచ్చి మంటలను ఆర్పింది. ఈ ప్రమాదంతో రూ.2లక్షల వరకూ నష్టపోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతుల కోరాడు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నార్పల : మండల పరిధిలోని నరసాపురం సమీపంలో మంగవారం మధ్యాహ్నం గుర్తు తెలియని పురుషుని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ సాగర్, పోలీసులు సందర్శించారు. అనంతరం మృతుని వివరాల కోసం మృతదేహం పొటోలను సామాజిక మాధ్యమాల్లో పెట్టి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హావలిగి, పాల్తూరులో 'పొలం పిలుస్తోంది'

ఉరవకొండ : విడపనకల్ మండల పరిధిలోనే హావలిగి, పాల్తూరు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య పర్యవేక్షణలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మిరప, మొక్కజొన్న పంటలను పరిశీలించి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవాకేంద్ర సిబ్బంది మెర్సీ, ముత్యాలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

పామిడి : జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని టిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు భవిష్యత్తులో రాణించడానికి ఏం చదవాలి.. ఎలాంటి చదువులకు ఏయే రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.. ఎలా జీవించాలనే విషయాలను ఎఎన్‌సెట్ అధికారి సునీల్‌కుమార్ వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు

పుట్లూరు : మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామంలో రైతు దామోదర్ సాగు చేసిన పప్పుశనగ పంటలో ఎఒ కాత్యాయిని ఆధ్వర్యంలో మంగళవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. అలాగే వ్యవసాయ విస్తరణ అధికారి హరి ఆధ్వర్యంలో కడవకల్లులో, మడుగుపల్లి గ్రామంలో రైతు గంగన్న సాగు చేసిన కంది పంటల్లో పంటకోత ప్రయోగం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపిఇఒ సుధ, విఆర్‌ఎ సుధ, బీమా ఏజెంట్ షమీర్, ఎఇఒ హరి, విఎస్‌ఎ సర్వరాజ్, విఎఎ నాగమణి, రైతులు పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్యశిబిరం

పామిడి : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వెటర్నరీ డాక్టర్ ఉషాకిరణ్ మంగళవారం ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా పశువులు, దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ మహబూబ్‌బాషా, పశు సహాయకులు హరినాథ్‌రెడ్డి, శ్రీనివాసులు, శివశంకర్, భరత్‌కుమార్, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని భైరవాణితిప్ప గ్రామంలో మంగళవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పశు వైద్యాధికారి నవీన్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా 34 పశువులకు పరీక్షలు, 168 పశువులకు వ్యాక్సినేషన్, ఆరు పశువులకు గర్భకోశ పరీక్షలు, 48 పశువులకు వ్యాక్సినేషన్ వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది సుధీర్, రమణానాయక్, నవీన్, ప్రియాంక, భానుప్రియ, గీత, పశువైద్య సహాయకులు పాల్గొన్నారు.

రైతులు పంట నమోదు చేసుకోండి

శింగనమల : మండల కేంద్రంలోని శింగనమల చెరువు ఆయకట్టు కింద వరి పంట సాగు చేసిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని ఎఒ అన్వేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయకట్టు పరిధిలోని శింగనమలతోపాటు గోవిందరాయుపేట, శివపురం, బండమీదపల్లి, చక్రాయపేట, పోతురాజుకాలువ, సోదనపల్లి, పెద్దమట్లగొంది, ఈస్టు నర్సాపురం, చిన్న జిల్లాలపురం, గురుగుంట్ల గ్రామాల రైతులు వారి పరిధిలోని రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ తీసుకుని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి పంట నమోదు చేసుకోవాలని కోరారు.

పద్మవిభూషణ్ అవార్డు గ్రహీతకు అభినందన

ఉరవకొండ : ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపికైన ప్రముఖ వైద్యులు, పరిశోధకులు దువ్వూరి నాగేశ్వరరెడ్డిని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ వై.శివరామిరెడ్డి అభినందించారు. ఈమేరకు హైదరాబాదులోని ఎఐజి ఆసుపత్రిలో నాగేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నాగేశ్వరరెడ్డి చేసిన సేవలు, పరిశోధనలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషణ్ అవార్డు ఇవ్వడం ఆనందకరమన్నారు. మున్ముందు ఇంకా ఎదగాలని ఆకాంక్షించారు.

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్షణ

గుంతకల్లులో అవగాహన కల్పిస్తున్న ఎంవిఐ రాజాబాబు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి సురక్షితమైన ప్రయాణం చేయాలని ఇటుకలపల్లి ఎస్ఐ విజయకుమార్ పిలుపునిచ్చారు. ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో ఇటుకలపల్లి పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతూ ఎక్కువ మంది తలకు గాయం కావడం వల్లే చనిపోతుండటం మనం చూస్తున్నామన్నారు. ఈ విచార ఘటనల వల్ల ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, హెల్మెట్ ధారణతో ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చని సూచించారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలన్నారు. దీంతోపాటు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి వాహనదారుడు డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లు వాహనాలు నడపరాదని, అతివేగం, ట్రిపుల్ రైడింగ్,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదన్నారు. హెల్మెట్ ధరించని వారిపై కఠినంగా ఎంవి యాక్ట్ ప్రకారం జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని, హెల్మెట్ ధరించటం ద్వారా మీ భద్రత, మీ కుటుంబం గురించి ఆలోచించాలన్నారు. ఈకార్యక్రమంలో అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంతకల్లు : వాహనదారులకు సంపాదన కంటే ముందు భద్రత ముఖ్యమని మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాజాబాబు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని పాఠశాలల బస్సుల డ్రైవర్లు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు నడిపే యాజమాన్యాలు డ్రైవర్‌తో పాటు అసిస్టెంట్‌ను కచ్చితంగా పెట్టుకోవాలన్నారు. చిన్నపిల్లలు ఎలాటి అవగాహన లేకుండా ప్రవర్తించి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఆటో డ్రైవర్లు బస్సు డ్రైవర్లు మద్యం తాగి వాహనాలను నడపరాదన్నారు. బాధ్యతను విస్మరిస్తే చాలా కుటుంబాల్లో విషాదం నింపిన వారు అవుతారన్నారు. ప్రమాదం అన్నది క్షణంలో జరిగిపోయేదన్నారు. కావున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ వాహనాలను నడపాలని కోరారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ సీఐ మనోహర్, ఆటో డ్రైవర్లు, పాఠశాలల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్' వైద్యసేవల పరిశీలన

గార్లదిన్నె : మండల పరిధిలోని ఎగువపల్లిలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ సంచార వాహన వైద్యసేవలను జిల్లా అధికారి డాక్టర్ నారాయణస్వామి మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా అసంక్రమిత సంక్రమిత వ్యాధులు, సంచార వైద్యసేవలు.. ఏయే వ్యాధులకు సంబంధించిన రోగులు వచ్చారు.. ఎలాంటి మందులు ఇచ్చారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్రీయ బాలల స్వాస్థ్ కార్యక్రమం కింద పిల్లలకు చేపట్టిన స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు గౌతమి, మంజుల, సూపర్‌వైజర్ కృష్ణమోహన్, ఎఎన్‌ఎం వనిత, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ అనిత, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుత సంచారంపై తనిఖీ

యాడికి : మండల పరిధిలోని గుడిపాడు, వెంకటాంపల్లి ప్రధాన రహదారి సమీపంలోని కొండల్లో చిరుత సంచరిస్తోందన్న పుకార్లు షికార్లు చేయడంతో పోలీసులు, అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా యాడికి సిఐ ఈరన్న, అటవీ శాఖ సిబ్బంది కలిసి సమీపంలోని కొండల్లో విస్తృతంగా తిరిగారు. రైతులు, గొర్రెల కాపరులు తదితరులను చిరుత సంచారంపై అధికారులు ఆరాతీశారు. ఏదేమైనా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

యువరైతుకు సన్మానం

ఉరవకొండ : 125 జొన్న బస్తాలను 11 ఎడ్లబండ్లకు కట్టి ఒకఎద్దుతో లాగించిన యువరైతు బోయ అశోక్‌ను జైకిసాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు మాట్లాడుతూ ఒక ఎద్దు 125 బస్తాల పేర్చిన 11 ఎడ్లబండ్లకు కట్టి ఒక ఎద్దుతో లాగతించడం ఆశ్చర్యకరమన్నారు. ఈ కార్యక్రమంలో జై కిసాన్ ఫౌండేషన్, ప్రతినిధులు నాగమల్లి అక్రాంత్, చరణ్‌బాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే రైతుల సంక్షేమం : ఎంపిపి

బెలుగుప్ప : తెలుగుదేశం ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం సాధ్యమని ఎంపిపి పెద్దన్న అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఎంపిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాలను దళారుల వారి చేతిలో మోసపోకుండా ప్రభుత్వమే కందులను క్వింటా రూ.7,550 చొప్పున కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ పృథ్వీసాగర్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమస్యలపై చర్చలు

రాయదుర్గం : పట్టణంలోని ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలపై ఎపి పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు స్థానిక డిపో మేనేజర్ శ్రీనివాసులతో మంగళవారం చర్చలు జరిపారు. ముఖ్యంగా డ్రైవర్లు, కండక్టర్ల కొత్త చార్టు ప్రకటించాలని, ఎడిసి సప్లింగ్ పూర్తి చేయాలని, వార్షిక ఇంక్రిమెంట్ సకాలంలో కలపాలని, చార్ట్ వద్ద ట్రాఫిక్ ఇన్‌ఛార్జిని నియమించాలని, ఇపికె, కెఎంపిఎల్ పేర డ్రైవర్లు కండక్టర్లను వేధించడం మానుకోవాలని, అక్రమంగా ఇచ్చిన ఛార్జ్ షీట్లు రద్దు చేయాలని, 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని కోరారు. ఆర్టీసీ విధానాల అమలు కొత్త సర్వీసులో ప్రవేశ పెట్టేటప్పుడు యూనియన్లను సంప్రదించాలని, రద్దు చేసిన సర్వీసులను తిరిగి ప్రారంభించాలని డిమాండ్ చేశారు. చర్చల్లో యూనియన్ డిపో కార్యదర్శి రామలింగప్ప యూనియన్ నాయకులు బాషా, కేటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

లాలా లజపతిరాయ్‌కు నివాళి

గుత్తి : స్వాతంత్ర్య సమరయోధులు, పంజాబ్ కేసరి లాలాలజపతిరాయ్ 160 జయంతిని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని పెన్షనర్ల భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పెన్షనర్ల సంఘం తాలూకా అదనపు కార్యదర్శి జెన్నే కుళ్లాయిబాబు, కార్యదర్శి కె.రామ్మోహన్, తాలూకా కోశాధికారి ఫక్రుద్దీన్ నాయకులు శామ్యూల్, చెన్నారెడ్డి, నారాయణశెట్టి, మద్దిలేటి, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి బాధ్యతతో పనిచేయాలి

రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

ప్రజాశక్తి-రాయదుర్గం

నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం సిద్ధాంతాలతో క్రియాశీలకంగా పనిచేస్తున్న బహుజన సమాజ్ పార్టీ బలోపేతం కోసం బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు కోరారు. మంగళవారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో నూతన కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. రాయదుర్గం కన్వీనర్‌గా వి.కృష్ణ, నియోజకవర్గ అధ్యక్షులుగా జయచంద్ర, ప్రధాన కార్యదర్శిగా జి.రామాంజనేయులు, ఉపాధ్యక్షులుగా డి.గంగాధర్, డి.హీరేహాల్ మండల కార్యదర్శిగా హెచ్.తిప్పేస్వామి, ఉపాధ్యక్షులుగా హెచ్.ఉల్లిగప్ప, ఉపాధ్యక్షులుగా జి.రాజు, కోశాధికారిగా ఎం.హేమంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రజా సమస్యలు, గుర్తించి సమస్యల పరిష్కారం కోసం పనిచేయాల్సిందని సూచించారు.

భూకబ్జాలపై ఆగ్రహం

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన మల్లాపురం లేఅవుట్ స్థలాలను బీఎస్పీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ స్థలాలను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుని అర్హులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ప్రతినిధులు ఉలుగప్ప, రామాంజనేయులు, జయచంద్ర, గంగాధర్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

బీసీలందరికీ సబ్సిడీ లోన్లు మంజూరు చేయాలి

పెద్దపప్పూరు : మండల పరిధిలోని బిసిలందరికీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని సిపిఐ మండలం కార్యదర్శి చింతా పురుషోత్తం డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసిలందరికీ సబ్సిడీ లోన్లు మంజూరు చేసి ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు భోగాతి రామేశ్వర్‌రెడ్డి, చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షులు కాశెట్టి నారాయణస్వామి, పిండిమిషన్ నాగిరెడ్డి, చింతా రామకృష్ణ, తలారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ దుకాణాల్లో తనిఖీలు

అనంతపురం : నగరంలోని పలు మొబైల్ దుకాణాల్లో లీగల్ మెట్రాలజీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మొబైల్ యాక్సరీస్ ప్యాకేజీ వస్తువులపై తయారీదారుని పూర్తి చిరునామా, తయారైన నెల, సంవత్సరం, వినియోగదారుడు ఫిర్యాదు చేసేందుకు ఉండాల్సిన పేరు, చిరునామా, ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడి తదితర చట్టపరమైన వివరాలు ముదిరించకపోవడంతో ఐదు కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్ ఎం.మహమ్మద్‌గౌస్, టెక్నికల్ అసిస్టెంట్ కె.మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం కోట ముఖద్వారం పరిశీలన

రాయగుర్గం కోట ముఖద్వారం పరిశీలిస్తున్న అధికారులు

రాయదుర్గం : పట్టణంలోని కోట వద్ద ఉన్న ప్రవేశద్వారాన్ని (ఊరు వాకిలి) కేంద్ర పురావస్తు శాఖ సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ యోగేష్ మంగళవారం పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న కోట ముఖద్వారం జీర్ణోదరణ పనులు చేసేందుకు కట్టడంలో భాగంగా ఆనుకుని ఉన్న మురికి కాలువను అక్కడి నుండి కొంత దూరానికి మార్చాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని కోరారు. కోట ముఖద్వారం జీర్ణోద్ధరణకు అవసరమైన మెటీరియల్ సేకరణకు తిరిగి మరోమారు టెండర్లు పిలవనున్నట్లు ఎఎస్ఐ సీనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ యోగేష్ తెలిపారు. తాను క్షేత్ర పరిశీలన చేసి మురికి కాలువ మళ్లింపు విషయమై అవసరమైన నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రతాప్, రాయదుర్గం హెరిటేజ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్. హులికుంటిమూర్తి, జ్యువెలర్స్ అసోసియేషన్ గౌరవ అధక్షులు కంసలి నాగరాజు, హెరిటేజ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి గుడేకోట శివకుమార్ తదితరులు ఉన్నారు.